విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

మహిళలే మహారాణులు

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు:

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మహిళా బిల్లుకు ఇటీవల పార్లమెంటులో మోక్షం లభించింది. రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడమే తరువాయి. రానున్న కాలంలో ఇది చట్టంగా మారనుంది. బిల్లుకు ఆమోదముద్ర పడినా రానున్న ఎన్నికలలో బిల్లు వర్తించకపోవడంతో మహిళా నేతలలో నిరాశను నింపింది. మహిళా బిల్లుపై కేంద్రం ఆమోదం తెలపడంపై మహిళా నేతల్లో పార్టీలకు అతీతంగా హర్షం వ్యక్తం అవుతుంది. రిజర్వేషన్ లేకపోయినా కొందరు మహిళా నేతలు ఇప్పటికే రాజకీయాలలో రాణిస్తుంటే, మరికొందరు స్థానిక సంస్థలలో రిజర్వేషన్లతో రాజకీయాలలో కొనసాగుతున్నారు. వీరిలో అధిక భాగం కుటుంబ సభ్యులు రాజకీయ రంగంలో ఉన్న వారే రాణిస్తున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందిన తర్వాత రిజర్వేషన్ కారణంగా మహిళలకు ఖచ్చితమైన సీట్లు ఖరారు కానున్నాయి. ఆయా సీట్లలో మహిళలే బరిలో ఉండాల్సి ఉంటుంది. బిల్లు ఆమోదంతో ఇకపై చాలామంది మహిళా నేతలు పురుష నేతలతో పోటీ లేకుండా నేరుగా కేటాయింపు నియోజకవర్గాల నుండి పోటీ పడనున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 నియోజకవర్గాలు ఉండగా ఇందులో 3 నియోజకవర్గాలలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వీటి కారణంగా రాబోయే రోజులలో ఏ ఏ నియోజకవర్గాలను మహిళలకు కేటాయిస్తారు అన్న ఆందోళన పురుషనేతలలో అప్పుడే మొదలైంది.

ఈసారి నిరాశే...

మహిళా బిల్లుకు చట్టసభలు ఆమోదముద్ర పడిన రానున్న ఎన్నికలలో బిల్లు వర్తించకపోవడం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మహిళలకు నిరాశ తప్పలేదు. ఇందుకు కారణం 2029 ఎన్నికలలో నియోజకవర్గాల పునర్ విభజన తర్వాతే మహిళలకు 33శాతం సీట్లను కేటాయించనున్నారు. అంతవరకు డిలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. అయితే ఉమ్మడి జిల్లాలో వచ్చే ఎన్నికలలో మహిళలు ప్రాతినిధ్యం వహించే సెగ్మెంట్లు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు కీలక నేతలు ఏఏ నియోజకవర్గాలు మహిళలకు వెళతాయో అన్న చర్చ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదలైంది. అయితే రానున్న ఎన్నికలకు సంబంధించి ఈ నిబంధనలు వర్తించకపోవడంతో ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీల నుంచి టికెట్లు ఆశిస్తున్న చాలామంది పురుషనేతలు ఊపిరి పీల్చుకున్నారు. మహిళా ఓటర్ల ఆధారంగా నియోజకవర్గాల కేటాయింపులు చేపట్టే అవకాశం ఉండడంతో తమకు సరిపడా నియోజకవర్గాలపై వారు దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

- మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదంతో జిల్లాలో హాట్ టాఫిక్...
- సిట్టింగ్ నేతల్లో కలవరం...

జిల్లాలో నేటి వరకు ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులు వీరే...

1952 నుండి 2019 వరకు పూర్వ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుండి మహిళలు ప్రాతినిధ్యం వహించి చట్టసభలలో తమ గళం వినిపించారు.

మెట్ట ప్రాంతంలో ఉన్న చింతలపూడి నియోజకవర్గంలో 2014 ఎన్నికలలో టిడిపి తరపున పీతల సుజాత ఎన్నికై మంత్రి పదవి నిర్వహించారు. అయితే సుజాత 2004లో ఆచంట నియోజకవర్గం నుండి కూడా ఎన్నికై ప్రాతినిధ్యం వహించారు. గోపాలపురం ఎస్ సి రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గంలో 1978లో దాసరి సరోజిని, 2004లో మద్దాల సునీత కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. 2009లో టిడిపి తరపున తానేటి వనిత ఎన్నికయ్యారు. అయితే తానేటివనిత 2019లో వైకాపా తరపున పోటీ చేసి గెలుపొంది ప్రస్తుతం హోం శాఖ మంత్రిగా ఉన్నారు. పెనుగొండ నియోజకవర్గం నుండి 1983, 1985 లో జరిగిన ఎన్నికలలో టిడిపి తరపున ప్రత్తి మణెమ్మ శాసనసభ్యులుగా గెలుపొందారు. ఆచంట శాసనసభ నియోజకవర్గం నుండి 1999లో మాచర్ల జోహార్వతి టిడిపి తరపున ఎన్నికయ్యారు. పాలకొల్లు నియోజకవర్గంలో 2009లో బంగారు ఉషారాణి కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందారు. నరసాపురం నియోజకవర్గంలో 1981 లో జరిగిన ఉప ఎన్నికల్లో పరకాల కాళికాంబ కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికై ప్రాతినిధ్యం వహించారు. ఉండి నియోజకవర్గంలో 1970 లో జరిగిన ఉప ఎన్నికలో కటిరెడ్డి ఆండాలమ్మ ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందారు. తాడేపల్లి నియోజకవర్గంలో 1983,87లో జరిగిన ఉప ఎన్నికలలో ఈలి వరలక్ష్మి టిడిపి తరపున ఎన్నికయ్యారు. దెందులూరు నియోజకవర్గంలో 1991 లో జరిగిన ఉప ఎన్నికలో మాగంటి వరలక్ష్మి కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందారు. కైకలూరు నియోజకవర్గంలో 1972లో కమ్మిలి మంగతాయారమ్మ కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం నుండి 1957లో మోతే వేదకుమారి కాంగ్రెస్ పార్టీ నుండి, 1962లో వీరమాచినేని విమలాదేవి సిపిఐ నుండి గెలుపొందారు.

అత్యధిక మహిళా ఓటర్లు ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్లు...

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రస్తుత లెక్కల ప్రకారం అత్యధికంగా మహిళా ఓటర్లు ఉన్న సెగ్మెంట్లను పరిగణలోనికి తీసుకుంటే ఈ విధంగా ఉన్నాయి.చింతలపూడి నియోజకవర్గంలో మహిళా ఓటర్లు 1,32,182, భీమవరం నియోజకవర్గంలో 1,27,787, పోలవరం నియోజకవర్గంలో 1,25,235 అత్యధికంగా మహిళా ఓటర్లు ఉన్నారు. అయితే లోక్ సభ, శాసనసభ స్థానాల పునర్విభజన కూడా చేయను ఉండడంతో వీటి సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

మూడు దశాబ్దాల కల సాకారం...

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంతో మూడు దశాబ్దాల కల సాకారం అవుతుందని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జన గణన, నియోజకవర్గాల డి లిమిటేషన్ ప్రమేయం లేకుండానే తక్షణం అమలు చేయాలని మహిళా వర్గం డిమాండ్ చేస్తుంది. లోక్ సభ, శాసనసభలే కాకుండా అన్ని చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేసినప్పుడే మహిళలకు న్యాయం జరిగినట్లు అవుతుంది. ఎన్నికల లబ్ధి కోసం కాకుండా మహిళా సాధికారిత, మహిళల హక్కుల కోసం కృషి చేసేందుకు మహిళా ప్రాతినిధ్యం ఎంతో దోహదపడుతుంది అనడంలో సందేహం లేదు.

రాష్ట్రంలో నియంత పాలన

– మాజీ ఎంపీ మాగంటి బాబు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతుందని ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు అన్నారు.మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై అక్రమ కేసులను పెట్టి రిమాండ్‌కు పంపడాన్ని నిరసిస్తూ పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ అధ్యక్షతన చేపట్టిన రిలే నిరాహార దీక్షలుకు ఆదివారం మాగంటి బాబు సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా మాగంటి బాబు మాట్లాడుతూ త్వరలో చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆకాంక్షించారు.ఆదివారం దీక్షలో తెలుగుదేశం సీనియర్ నాయకులు అన్నప్రగడ వీర రాఘవరావు, మన్యం దుర్గారావు, నాయుడు శ్రీనివాస్ , కొత్తపల్లి వీర వెంకటేశ్వరరావు, యాదాల వెంకటేశ్వరరావు, కాకి శ్రీను కూర్చున్నారు. ఈ దీక్షలకు టిడిపి నాయకులు చింతలపూడి నియోజకవర్గం అబ్జర్వర్ కోళ్ల నాగేశ్వరరావు నాయకులు పరిమిసత్తిపండు, బొబ్బరరాజ్ పాల్ కుమార్ ,ఆకుమర్తి రామారావు, చిట్రోజు తాతాజీ, చిలంకూరి బాబి, కోలా శ్రీను,కోనే సుబ్బారావు,చిట్టి బోయిన రామలింగేశ్వరరావు, మక్కినవారిగూడెం సర్పంచ్ మోతుపల్లి గోపాలరావు , బాలిన రాంబాబు జీవళ రామయ్య తదితరులు సంఘీభావం తెలిపారు .

రానున్న ఎన్నికల్లో టీడీపీదే అధికారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేయడంతో పట్టణంలో పోలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ బోరగం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో గత 12 రోజుల నుండి నిర్వహిస్తున్న సామూహిక నిరాహార దీక్షలో రోజుకు ఒక మండలానికి చొప్పున పార్టీ నాయకులు కార్యకర్తలు దీక్షా శిబిరంలో పాల్గొన్నారు. ఆదివారం దీక్ష శిబిరానికి ఏలూరు పార్లమెంట్ మాజీ సభ్యులు మాగంటి బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఇంటలిజెన్స్ రిపోర్ట్ తెలుసుకున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలను ఆరోపిస్తే ప్రజా నాడిని మార్చవచ్చా అనే ఆలోచనతో ఇటువంటి దుర్మార్గపు పనులకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు మొడియం సూర్యచంద్రరావు, మండల పార్టీ అధ్యక్షులు పారేపల్లి నరేష్, పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణ, పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, పరిమి రాంబాబు, తంకట రమేష్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఉంగుటూరు : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో ఉంగుటూరులో జరుగుతున్న టిడిపి ఆదివారం 12 రోజు కు చేరుకున్నది. శిబిరాన్ని ఏలూరు మాజీ ఎంపీ మాగంటి బాబు, ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు సందర్శించారు. దీక్ష చేస్తున్న ముత్యాల స్వామి, పోసింశెట్టి రామ్మూర్తి, సంకు శీను, పుప్పాల నారాయణస్వామి, ఇందుకూరి రామరాజు, యాళ్ల సుబ్బారావు,ఇందుకూరి, యాళ్ల, సురేంద్ర లకు సంఘీభావం తెలిపారు. ఉంగుటూరు మండల టిడిపి నాయకులు నల్ల ఆనంద్ కుమార్, నేకూరి ఆశీర్వాదం, బందారు మధుబాబు, పాతూరి విజయకుమార్, చందు, ఇమ్మని గంగాధర్ రావు, బొమ్మిడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును ఎదుర్కోలేక అక్రమ అరెస్టులు

- ఎమ్మెల్యే మంతెన రామరాజు...

విశాలాంధ్ర - ఉండి : తెదేపా అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కోలేని రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అవినీతి ఆరోపణలతో అరెస్టు చేయించిందని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన ఉండిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా ఎమ్మెల్యే మంతెన రామరాజు, టిడిపి నాయకులు అర్ధనగ్న జల దీక్షను నిర్వహించారు. మంతెన రామరాజు మాట్లాడుతూ ఎవరెన్ని ఆరోపణలు చేసిన చంద్రబాబు అవినీతి మచ్చ లేకుండా జైలు నుండి విడుదల అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ఈ నిరంకుశ పరిపాలన నుండి విముక్తి పొందాలంటే ప్రజలందరూ టిడిపి జనసేన కూటమికి మద్దతు పలకాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆకివీడు మండల అధ్యక్షులు మోటుపల్లి రాంప్రసాద్, ఉండి మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ, గొంట్ల గణపతి, కరిమెరక శ్రీనివాస్, బచ్చు కృష్ణ, బచ్చు సరళ దేవి, కాగిత బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అలవెన్స్ చెల్లించాలి

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం: మున్సిపాలిటీలలో పనిచేసే పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగ కార్మికులకు హెల్త్ అలవెన్సులు వెంటనే చెల్లించాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 21వ తేదీ నుండి 27 వ తేదీ వరకు దశలవారీగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలు ఆదివారంతో నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్లో మున్సిపల్ కార్మికులు మానవహారం నిర్మించారు.తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు దీర్ఘ కాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం రూ.26వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జంగారెడ్డిగూడెం గౌరవాధ్యక్షులు జే.వి. రమణ రాజు,అధ్యక్షులు కొత్తూరి నాగేశ్వర రావు, కార్యదర్శి బొక్కా శ్రీనివాసరావు,రేలంగి నాగరాజు, ఇంగుర్తి నాగరాజు, పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూడు రోజులపాటు వ్య.కా.స రాష్ట్ర మహాసభలు

- రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - ఏలూరు: ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎం యు) రాష్ట్ర 22వ మహాసభలు సందర్భంగా నేడు బాపట్ల పట్నంలో కూలి దండు మహా ప్రదర్శన జరుగుతుందని బికెయంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. బికెయంయు రాష్ట్ర 22 మహాసభలు నేటి నుంచి మూడు రోజులపాటు బాపట్ల పట్టణంలో జరుగుతున్నాయని ఆయన వివరించారు. మహాసభల ప్రారంభ సూచికంగా సోమవారం మధ్యాహ్నం గం.3లకు బాపట్లలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుండి మహా ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. సాయంత్రం గం.4లకు రథం సెంటర్లో గ్రామీణ పేదలచే బహిరంగ సభ జరుగుతుందన్నారు. సభకు బికెఎంయు రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు జల్లి విల్సన్ అధ్యక్షత వహిస్తారని అయిన తెలిపారు. బహిరంగ సభకు ప్రధాన ఉపన్యాసకులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, బికెఎంయు జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జర్ సింగ్ గోరియా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, బికెఎంయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తదితరులు మాట్లాడతారని తెలిపారు. బాపట్లలో జరిగే కూలి దండు మహాప్రదర్శనకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి 500 మంది వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు తరలి వెళున్నట్లు ఆయన చెప్పారు. ఈ నెల 26,27 తేదీల్లో జరుగు ప్రతినిధుల సభకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుండి 50 మంది హాజరవుతున్నట్లు బండి వెంకటేశ్వర రావు తెలిపారు.

అనారోగ్యంతో వెలిది కృష్ణ మూర్తి మృతి

విశాలాంధ్ర-టీ.నరసాపురం : కె జగ్గవరం సొసైటీ మాజీ అధ్యక్షులు వెలిది కృష్ణ మూర్తి (78) హైదరాబాద్ లో ప్రైవేటు హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందడంతో పలువురు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కె.జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు మాట్లాడుతూ కె.జగ్గవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి వెలిది కృష్ణమూర్తి చేసిన సేవలు మరువలేనివి అన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కె జగ్గవరం సొసైటీ కి కోటి రూపాయల పైబడి విలువ చేసే స్థలాన్ని ఇచ్చి సంఘ భవనాలు,గిడ్డంగుల నిర్మాణానికి ఎనలేని కృషి చేసినట్లు ఆయన తెలిపారు. 40 సంవత్సరాల పైబడి సొసైటీ అధ్యక్షునిగా,5 సంవత్సరాలు కేతవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ గా ఎనలేని సేవలు అందించారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు చైర్ పర్సన్ మధుతో పాటు పర్సన్లు వంటిపల్లి వెంకటేశ్వరరావు, కొరప్రోలు చంద్రశేఖర్ రెడ్డి, సిఇఓ తనగాల వీర వెంకయ్య, సంఘ సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిరంతర అభ్యాసన నిజమైన అధ్యాపకుని లక్షణం

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం : శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ పూర్ణిమ శర్మ విశ్వ విద్యాలయ ఉపాధ్యాయుల కేటగిరిలో ఎలక్ట్రానిక్స్ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కాబడి ఈ నెల 5వ తేదిన విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న శుభ సందర్భంలో ఆమెను కళాశాల యాజమాన్యం శనివారం ఘనంగా సత్కరించింది. కళాశాలలో శనివారం సాయంత్రం జరిగిన పూర్ణిమ శర్మ సత్కార కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల పాలక వర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు పూర్ణిమ శర్మను సహచర పాలక వర్గ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్ రావు, టెక్నికల్ డైరక్టర్ చక్కా అప్పారావు, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కుసుమ కుమారి తదితరులు ప్రసంగించారు. వివిధ ఇంజనీరింగ్ విభాగాల అధిపతులు, సీనియర్ అధ్యాపకులు పూర్ణిమ శర్మకు తమ శుభాకాంక్షలు తెలిపారు.

అరాచకాలను ఆపండి....

విశాలాంధ్ర - చింతలపూడి: రాష్ట్రంలో వైసిపి చేస్తున్న అరాచకాలు ఆపాలని టిడిపి యువ నాయకులు బొమ్మాజీ అనిల్ హెచ్చరించారు. మండలం మల్లయ్య గూడెం గ్రామపంచాయతీలో చంద్రబాబు అక్రమ అరెస్టని ఖండిస్తూ మల్లయ్య గూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ చీకటి కవిత రమేష్ ఆధ్వర్యంలో యువ నాయకులు బొమ్మాజి అనిల్ ఇంటింటికి బాబుతో నేను అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఐటీ ఉద్యోగులను ఆపేందుకు బోర్డర్‌లో పోలీసుల తనిఖీలు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సంఘీభావం తెలిపేందుకు ఐటీ ఉద్యోగులు వస్తున్నారనే సమాచారం మేరకు ఆంధ్ర బార్డర్ చెక్ పోస్ట్ వద్ద ఆదివారం పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆదివారం సెలవు కావడంతో హైదరాబాద్ లో పనిచేస్తున్న ఐటి ఉద్యోగులు రాజమండ్రికి భారీగా తరలివస్తున్నారనే సమాచారం మేరకు ఉన్నత అధికారులు ఆదేశాలతో బోర్డర్ చెక్పోస్టుల వద్ద పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. జీలుగుమిల్లిలోని తాటాకులగూడెం వద్ద ఉన్న ఆంధ్ర బార్డర్ చెక్పోస్ట్ వద్ద ఇద్దరు ఎస్ఐలు పదిమంది కానిస్టేబుల్స్ బందోబస్తు నిర్వహించి తెలంగాణ మీదుగా ఆంధ్రకు వచ్చే ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనాలలో ఉన్న వ్యక్తుల వివరాలు తెలుసుకుని ఆంధ్రాలోకి దేనికి వస్తున్నారు, వారు చేస్తున్న పని ఏమిటి అంటూ వివరాలు అడిగిన తర్వాతే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆంధ్రలోకి అనుమతిస్తున్నట్లు పలువురు వాహన చోదకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి ఎస్ఐ. వి. చంద్రశేఖర్, బుట్టాయిగూడెం ఎస్ఐ. వెంకన్న, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బెలూన్లతో టీడీపీ నిరసన

విశాలాంధ్ర - భీమవరం : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆదివారం టిడిపి శ్రేణులు భీమవరంలో చేపట్టిన నిరాహార దీక్షల్లో నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజినేయులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్, కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంట త్రిమూర్తులు నిరాహారదీక్షకు సంఘీభావం తెలిపారు. నాయకులు మాట్లాడుతూ చంద్రబాబుకు మచ్చ అంటించాలని జగన్ ప్రభుత్వం అక్రమకేసులు బనాయించి అరెస్టుచేసి జైలుకి పంపిందని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రేవు వెంకన్న, గూడూరి సుబ్బారావు, నసిమబేగం, మాదాసు కనకదుర్గ, ఎండి.షబీనా, బీ.పద్మ, గంధం రాధ, నరహరశెట్టి రూపవాణి, వీరమల్లు సూరిబాబు, పంతం వెంకట సతీష్, కోళ్ల నాగబాబు, జంపన ధనరాజ్, లంకి చిన్ని, విజ్జురోతు రాఘవులు పాల్గొన్నారు.

భారతీయ విద్యా భవన్స్‌కు.. రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు సంబంధం లేదు

ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు

విశాలాంధ్ర - భీమవరం: భారతీయ విద్యా భవన్స్‌కు రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు ఎటువంటి సంబంధంలేదని భారతీయ విద్యా భవన్స్‌ను రైస్ మిల్లర్స్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించి బొంబాయి విద్యా భవన్స్‌కు గిఫ్ట్ రూపంలో ఇచ్చామని భారతీయ విద్యా భవన్స్ చైర్మన్ ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు తెలిపారు. భారతీయ విద్యా భవన్స్ లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో సొసైటీ సభ్యులతో కలిసి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తనపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు 250 మంది 1981లో వ్యక్తిగతంగా విరాళాలిచ్చి 83 లక్షలతో రైస్ మిల్లర్స్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అసోసియేషన్ పేరుతో తాడేపల్లిగూడెంలో 30 ఎకరాల్లో, భీమవరంలో 17 ఎకరాల్లో విద్యా భవన్స్ నిర్మించామని వీటితో పాటు పాలకొల్లులో తదుపరి నిర్మించామని, ఇటీవలే గుంటూరు, రాజమండ్రిలో కూడా నెలకొల్పామని మరిన్ని ఉన్నత ప్రమాణాలు నెలకొల్పదానికి బొంబాయి లోని భారతీయ విద్యా భవన్‌కు అంచేశామని పూర్తి నిర్వహణ వారే చూసుకుంటారని ఆయన తెలిపారు. విద్యా భవన్స్ కు భూరి విరాళాలిచ్చిన దాతల కుటుంబాల నుండే గవర్నింగ్ బాడీ పనిచేస్తుందని అప్పట్లో 250 దాతలకు బొంబాయి విద్యా భవన్స్ లైఫ్ కార్డులు ఇచ్చిందని మూడేళ్లకు ఒక సారి ఎన్నికలు జరుగుతున్నాయని ఎన్నికయిన గవర్నింగ్ బాడీ భారతీయ విద్యా భవన్ వ్యవహారాలను పర్యవేక్షిస్తుందని ఆయన వెల్లడించారు.

లయన్స్ క్లబ్ మెరుగైన సేవలు అందించాలి

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర - తణుకు: లయన్స్ క్లబ్ నాయకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ అన్నారు. పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలోని 65 లయన్స్ క్లబ్స్ నాయకులకు, నాయకత్వ లక్షణాలు సంఘ నిర్వహణ అవగాహన కార్యక్రమం ఆదివారం ఏలూరు జిల్లా లయన్స్ భవనం లో ఏర్పాటు చేసిన గ్లోబల్ యాక్షన్ టీం వర్క్ షాప్‌లో ముఖ్య అతిథి ఎం.ఎల్.సి, ఆంధ్రప్రదేశ్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నాయకులుగా ఉంటూ ఆ ప్రాంతంలో సమాజానికి ఉపయో గపడే విధంగా సేవా కార్యక్రమాలు చేయవలసి అవశ్య కత ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో వెల్ నెస్ సెంటర్ పెట్టి నిపుణులు లైన నర్సింగ్ స్టాఫ్‌ను పెట్టిందని వారితో మన సేవాసంస్థలు కలసి, డయాబెటిస్, ఇతర ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మేలైన సేవలు చేయవచ్చని రవీంద్ర నాథ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ గట్టి మాణిక్యం, వైస్ గవర్నర్ ఎం వేణుబాబు, ఏరియా లీడర్ డా.వి ఎస్ వి డి ప్రసాద్, మల్టిపుల్ లీడర్స్ దామెర్ల శ్రీశాంతి, ఏ ఆర్ కె చౌదరి, కె.పద్మావతి, మాదిరెడ్డి కృష్ణ కుమారి పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే మహిళా రిజర్వేషన్

– సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-తణుకు: వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చట్టం హడావిడిగా ఆమోదించి అమలు 2027 తర్వాత అనడం బిజెపి పచ్చి అవకాశవాద రాజకీయాలకు దర్పణం పడుతుందని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఆదివారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్ నందు జరిగిన ఏపి మహిళా సమాఖ్య తణుకు పట్టణ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి మహిళా సాధికారతపై చిత్తశుద్ధి వుంటే తక్షణమే చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి తేవాలని భీమారావు డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన బిజెపి ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో ఓటమి భయంతోనే మహిళా బిల్లు ఆమోదించిందన్నారు.మహిళలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలనే దురుద్దేశ్యం తప్ప మరొకటి కాదన్నారు. మహిళా రిజర్వేషన్ తక్షణ అమలుకు మహిళా సమాఖ్య ఉద్యమించాలని కోరారు. ఏపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నెక్కంటి జగదాంబ, జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడుతూ సీపీఐ జాతీయ నేత, భారత జాతీయ మహిళా సమఖ్య జాతీయ నేత గీతాముఖర్జీ పోరాటఫలితమే మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అన్నారు.1996 లోనే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కోరుతూ పార్లమెంటు ఆమోదానికి మహిళా బిల్లు ప్రవేశపెట్టిన ఘనత గీతాముఖర్జీ దేనన్నారు. జీవితాంతం మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టం తేవడానికి నిర్విరామంగా శ్రమించారన్నారు. ఏపి మహిళా సమాఖ్య పశ్చిమ గోదావరి జిల్లా మహాసభ వచ్చేనెల 9వ తేదీన ఉండిలో నిర్వహించనున్నట్టు జగదాంబ, పుష్పకుమారి చెప్పారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ మహిళలెదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి వారి అభ్యున్నతికి మహిళలను సంఘటిత పరిచి వారి హక్కులు సాధనలో సీపీఐ ఎప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం ఏపి మహిళా సమాఖ్య తణుకు పట్టణ అధ్యక్షురాలుగా సావారపు దేవి, కార్యదర్శిగా వలవల అరుణకుమారి, కోశాధికారిగా ఉమామహేశ్వరి, కమిటీ సభ్యులుగా పిండి సత్యవతి, దుర్గ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మోదీ హయంలో రాజ్యాంగ రిజర్వేషన్లు నిర్వీర్యం

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి

విశాలాంధ్ర - గణపవరం: భారత్ ప్రధాని మోడీ హయాంలో రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లు నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర ఆదివారం 4వ రోజు భాగంగా గణపవరం మండలంలో సరిపల్లి, పిప్పర దళిత పేటల్లో కొనసాగింది. సరిపల్లె గ్రామంలో జరిగిన సభలో జక్కం శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారులకు వచ్చిన మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. కుల వివక్షకు కేంద్రంగా ఉన్న కుల వ్యవస్థను పెంచి పోషించే మను ధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తోందన్నారు. ప్రజల మధ్య అసమాన తలను సృష్టించి మత ఘర్షణలను చేస్తున్నారని విమర్శించారు. దేశంలో పేదవారి సొమ్మును దోచి పెద్దలకు పెట్టే వైఖరి బిజెపి పాటిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, బాతిరెడ్డి జార్జి, సహాయ కార్యదర్శిలు చిన్నం చిన్న నాగేశ్వరరావు, భళ్ళ చిన్న వీరభద్రం, ప్రజానాట్య మండలి జిల్లా నాయకులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ, రంగ, రాఘవులు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి నాయకులు ,కట్టురి ప్రసాద్, కేత శ్రీను,సోదడసి సంజీవరావు, గుత్తుల శ్రీను,బళ్లారుపు అశోక్, మదసి జీవన్, నత్త సుబ్బారావు,నరాలశెట్టి రామమకృష్ణ, మెడిశెట్టి పెంటరావు పాల్గొన్నారు

విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలి

- కలిశెట్టి విజయ్ కృష్ణ, రజిని కుమార్

విశాలాంధ్ర - ఉండి: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ ముందుం డాలని ఇండియన్ డిజిటల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ కలిశెట్టి విజయ్ కృష్ణ, రజిని కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం పాఠశాలలో ఎల్కేజీ యూకేజీ విద్యార్థిని విద్యార్థులతో ఝాన్సీ లక్ష్మీబాయి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, రాణి రుద్రమ్మ దేవి, అల్లూరి సీతారామరాజు జవానులు, రైతులు, స్వాతంత్ర్య సమరయోధులు వివిధ రకాల వేషధారణతో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కృష్ణ, రజిని కుమార్ మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ విద్యార్థిని, విద్యార్థులు ప్రతిభ కనబరచాల న్నారు. వేషధారణతో సరిపోదని స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను పూర్తిస్థాయిలో తెలుసుకుని వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఉండిలో ఉన్న ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థులలో ఉన్న టాలెంట్లు మెరుగుపరచడంలో పోషిస్తుందని వారు తెలిపారు. అనంతరం ఈ కాంపిటీషన్లో పాల్గొన్న ప్రతి విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

సోమవారం 25 సెప్టెంబర్ 2023

తరాలు మారాయి.. పాత తరం వాళ్ళకి కష్టమే

- సినీ నిర్మాత నరసింహారావు

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : తరాలు మారాయి.. పాత తరం వాళ్ళకి ఇప్పుడు సినిమా చేయాలంటే కష్టమేనని, ఆనాటి నిర్మాతలకు ఈ తరంలో చేద్దామన్నా అవకాశాలు రావడం లేదని సినీ నిర్మాత, రాశీ మూవీస్ అధినేత మారెళ్ల నరసింహారావు అన్నారు. ఆదివారం భీమవరంలో మాట్లాడుతూ తన 20వ ఏటానే సినీ పరిశ్రమకు డబ్బింగ్ చిత్రం చేశానని, సుమారు 60 చిత్రాలు చేశానని, 40 డబ్బింగ్, 20 నిర్మాతగా చేశానని అన్నారు. కోదండ రామిరెడ్డి దర్శకత్వంలో శోభన్ బాబు హీరోగా బావ మరదళ్లు చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నానన్నారు. అబ్బాయి గారు, మహారాజ, మంగళ గౌరీ, పెళ్లైంది, భార్య భర్తలు ఇలా ఎన్నో సినిమా చేశానని, పెళ్లైంది చిత్రం ఎంతో ఇష్టంతో చేశానని, కానీ ఆశించిన ఫలితం రాలేదన్నారు. శోభన్ బాబుతో 6 చిత్రాలు చేశానని, కృష్ణతో గుడచారి 117, విశ్వనాథ్, ఈవివిలతో చిత్రాలు చేశానని, రాఘవేంద్రరావుతో చేయాలని ఉండేదన్నారు. ప్రస్తుతం సినీ పరిశ్రమకు దూరంగా ఉన్నానని, ఇప్పటి ట్రేడ్స్ తగ్గట్టుగా కథలున్నా దానికి తగ్గ బడ్జెట్ కష్టమేనని అన్నారు. పాత తరం వాళ్లని తీసుకోవడానికి కొత్త తరం వాళ్ళు కొంత ఆలోచిస్తున్నారని అన్నారు.

వేడంగిలో వైభవంగా గణేష్ నిమజ్జనం

విశాలాంధ్ర - పోడూరు: మండలంలోని వేడంగిలో శివాలయం సెంటర్ వద్ద గణేష్ యూత్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఆదివారం వైభవంగా నిమజ్జనోత్సవం జరిపారు. తొలుత వినాయకునికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి ప్రసాదం లడ్డును పాట పెట్టిన అనంతరం అందంగా అలంకరించిన వాహనంపై గణేష్ ని విగ్రహాన్ని ఉంచి భజంత్రీలతో గ్రామం వీధులలో ఊరేగింపు జరిపారు. మహిళలు హారతులు ఇచ్చారు అనంతరం నరసాపురం నిడదవోలు కాలువలో వినాయకుని విగ్రహాన్ని నిమజ్జనోత్సవం చేశారు. ఈ సందర్భంగా అన్న సమారాదన జరిపారు. గణేష్ యూత్ కమిటీ సభ్యుల పర్యవేక్షణ లో ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామివారి నిమజ్జోత్సవ కార్యక్రమాన్ని జరిపారు.

శ్రీనును పరామర్శించిన జనసేన ధర్మరాజు

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం అగ్రహార గోపవరం గ్రామానికి చెందిన పుచ్చకాయల శ్రీనుకి ఇటీవలే ప్రమాదవశాత్తు కాలు ఫ్రాక్చర్ అయినందున ఆదివారం శ్రీనుని పరామర్శించిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్ చార్జ్ పత్సమట్ల ధర్మరాజు ఆయనతో పాటు జనసేన నాయకులు వంగ రఘు,తోట శ్రీను,తానేటి జోగేశ్వరావు,గ్రామ అధ్యక్షులు నాయుడు ప్రభాకర్, ఉపాధ్యక్షులు బోనాల నారాయణ, మీసాల బాబ్జీ, కొండవీటి వీరభద్రరావు, కోటి, చిన్నం ఆనంద్, గ్రామ జనసైనికులు,తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఉంగుటూరు మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి అన్నారు. ఆదివారం ఉంగుటూరులో మంద జయలక్ష్మి నివాసంలో మండల మానవతా సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షులు గంజి రవి కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో శీతాల సత్యనారాయణ బొమ్మిడి అప్పారావు, పిళ్ళా రామకృష్ణ, కొనే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర - కలిదిండి: గ్రామాలలో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి కి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం. నాగేశ్వరావు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దలంక గ్రామంలో రూ 20 లక్షల తో నిర్మించిన సీసీ రోడ్డు ను ప్రారంభించి శిలాఫలం ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏదైతే మాట ఇచ్చామో ప్రతి పనిని ప్రతి మాటను నెరవేర్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ ఐనాల. బ్రహ్మాజీ, ఏఎంసి ఉపాధ్యక్షులు పాము. రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని. రమేష్ పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - తణుకు: జాతీయ సేవా పథకం ద్వారా నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ కరటూరి రామకృష్ణ అన్నారు. స్థానిక ఎస్ కె ఎస్ డి (డిగ్రీ, పీజి) అటానమస్ మహిళా కళాశాలలో ఆదివారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సామాజిక సేవ ఇతరులకు, నాకు కాదు అనే సిద్ధాంత ప్రచారంతో దేశమంతా అత్యధిక సభ్యులతో కూడి సంఘ, రాష్ట్ర దేశమునకు సంబంధించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక విషయముల పట్ల అవగాహన కల్పించడంలో ఎన్ఎస్ఎస్ ముఖ్యపాత్ర వహిస్తుందన్నారు. సామాజిక సేవ అనేది ప్రజా చైతన్యాన్ని, బాధ్యతుల్ని కలుగజేస్తుందని తెలిపారు. విద్య వైద్య ప్రకృతి పరిరక్షణ మొదల విషయాలలో జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థిని విద్యార్థులు చేసే సేవలు అద్భుత మైనవన్నారు. సమాజానికి ఉపయోగపడే చైతన్యాన్ని కలిగించే కార్యక్రమాలు చేయడానికి జాతీయ సేవా పథకం ఎంతో ఉపయోగపడుతుందని, సేవ ద్వారా ఆత్మ సంతృప్తి పొందుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. రమ్య, పిల్లాడు సిహెచ్ రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర - పెదవేగి: మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు వారి ఆశయ సాధన కోసం ప్రతి వ్యక్తి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, దెందులూరు నియోజకవర్గం శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం రామసింగవరం గ్రామంలో ఏర్పాటు చేసిన బాబు జగజీవన్ రామ్ విగ్రహాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. భారత పార్లమెంటులో ఎక్కువ కాలం మంత్రిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కుతుంద న్నారు. రైల్వే శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో అనేక సంస్కరణలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మెట్లపల్లి సూరిబాబు, వెన్నవల్లి రవి, మహేంద్ర దళిత నాయకులు పెరికే వరప్రసాద్, పొలిమేర హరికృష్ణ, ఎర్ర నాగమల్లేశ్వరరావు, కూచింపూడి ఎంపీటీసీ కాలి చిన్న బుజ్జి, బాబు జగజీవన్ రామ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి పటిష్ట చర్యలు

- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

విశాలాంధ్ర - భీమవరం టౌన్: భీమవరం నియోజవర్గంలోని ఆలయాల అభివృద్ధికి పటి ష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పంచారామ క్షేత్రాల్లో ఒకటైన గునుపూడి శ్రీఉమా సోమేశ్వర జనార్ధన స్వామి వారి దేవస్థానం ఇంచార్జ్ ఈవోగా నియమితులైన డి.రామ కృష్ణంరాజు ఆదివారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యా లయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తులకు ఆలయంలో ఆధ్యాత్మికతను కల్పించడంతోపాటు స్వామి వారి, అమ్మవారి దర్శనం ప్రశాంత వాతావరణంలో కల్పించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ఈ ఆలయంలో ఈవోగా పనిచేసిన చాగంటి సురేష్ నాయుడు నరసాపురం గ్రూపు దేవస్థానాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మొగల్తూరు మండలం ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం ఇవోగా పనిచేస్తున్న డి.రామకృష్ణం రాజును పంచారామ క్షేత్రం ఇన్చార్జ్ ఈవోగా నియమించడం జరిగింది.

26న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

విశాలాంధ్ర -భీమవరం: పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ఉదయం మేంటేవారి తోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఆదివారం ఆయన భీమవరంలో ఒక ప్రక టన విడుదల చేసి మాట్లాడుతూ విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ పిల్లలను పరీశీలించి చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

నూతన కమిటీ రైతుల అభ్యున్నతికి కృషి చేయాలి

పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి

విశాలాంధ్ర - ఉండి: రైతుల అభ్యున్నతికి నూతన కమిటీ కృషి చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహారాజు అధ్యక్షతన నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ముదునూరి ప్రసాదరాజు, పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన కమిటీ రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఉండి మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రంలోని శాస్త్రవేత్తలతో అను సంధానమై వారి సలహాలు సూచనలు తీసుకుని రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. ఏ కాలంలో ఏఏ పంటలు పండించాలి అనే విషయంపై శాస్త్రవేత్తలతో అవగాహన కార్యక్ర మాలను నిర్వహించాలన్నారు. పుంత రహదా రులను అభివృద్ధి పరిచి రైతులు పంటను మిల్లర్లకు అందించేందుకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలన్నారు. అనంతరం నూతన కమిటీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ చేకూరి రాజా నరేంద్ర కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ మీద నమ్మకం ఉంచి తమకు అవకాశం కల్పించిన డిసిసిబి చైర్మన్ పివిఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, గుడాల శ్రీహరి గోపాలరావు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, మేడిది జాన్సన్, చిన్నమిల్లి రాయుడు, ఉండి గ్రామ సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, వివిధ గ్రామాల సర్పంచులు, మండల జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతిని దర్శించుకున్న ధర్మరాజు

విశాలాంధ్ర- ఉంగుటూరు : ఉంగుటూరు మండలం రావులపర్రు గ్రామం లో శ్రీ లక్ష్మి గణపతి ఆలయం లో స్వామి వారిని ఆదివారం ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జీ పత్సమట్ల ధర్మరాజు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.వారితో పాటు పొత్తూరి కృష్ణం రాజు, వంగ రఘు, తాడిశెట్టి ఎంటి. స్వామి, శివ కుమార్, ప్రసాద్, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఏలూరు క్రైమ్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెండవ పట్టణ ఎస్ ఐ శేఖర్ హెచ్చరించారు. ఆదివారం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో రౌడీ షీటర్ల కు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లతో ఎస్ఐ శేఖర్ మాట్లాడుతూ ప్రజాశాంతికి భంగం కలిగించే లాగా ఎవరైనా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ ప్రవర్తన కలిగి అంటే రౌడీ షీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు.రౌడీ షీట్లు కలిగి ఉండి ప్రజాశాంతికి లేదా ప్రైవేట్ సెటిల్మెంట్ లకు ప్రయత్నం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర - కలిదిండి: కలిదిండి శివారు భోగేశ్వర లంకలో కొలువై ఉన్న శ్రీ పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర దేవస్థానం ఆలయ పునః నిర్మాణం కొరకు కృషి చేయాలని ఎమ్మెల్యే దూలం. నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం భోగేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఆలయ పాలక మండలి, మండల ముఖ్య నాయకులు మరియు ఈఓ లతో జరిగిన అభివృద్ధి సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవస్థానం యొక్క అభివృద్ధి పనుల గురించి చర్చించారు. అనంతరం నిర్వహణ కమిటీలను, ఆర్థిక సహాయక కమిటీలను నియామకం చేశారు. తొలుత శ్రీ స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన. ఉమామహేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ ఐనాల. బ్రహ్మాజీ, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి. శ్రీదేవి, వైస్ ఎంపీపీ కూసంపూడి. కనక దుర్గారాణి, ఏఎంసి ఉపాధ్యక్షులు పాము. రవి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని. రమేష్, చెరుకువాడ. బలరామరాజు, మాజీ ఏఎంసి అధ్యక్షులు నీలపాల. వెంకటేశ్వరరావు, సర్పంచ్లు మసీముక్కుల. మారుతి ప్రసన్న, సాన. మీనా సరస్వతి, ద్రోణాద్రి. నాగలక్ష్మి, అనపర్తి. వడ్డీ కాసులు, మహాదేవ. విజయబాబు, గండికోట. ఏసుబాబు, ఎంపీటీసీ గోదావరి. సత్యనారాయణ, ఇమ్మానేని. లక్ష్మణరావు, పిఏసియస్ అధ్యక్షులు వడుపు. రామారావు, సాగి. చిన్నబ్బాయి రాజు, అంకెం. నరసయ్య, వడ్లాని. పార్థసారధి, తోకల. జగన్మోహన్, మాజీ జడ్పీటీసీ చన్నంశెట్టి. కోదండ రామయ్య, మోకా. రామకృష్ణ, తిరుమలశెట్టి. సుబ్రహ్మణ్యం, చన్నంశెట్టి నాగరాజు, నంబూరి బాబిరాజు, చిట్టూరి. బుజ్జి, బాలకృష్ణ, నాగముని, గొర్ల వెంకటేశ్వరరావు, కొల్లాటి. సత్యనారాయణ, చన్నంశెట్టి. సోమేశ్వరరావు, గండికోట వెంకటే శ్వరరావు, ఎం. వెంకటేశ్వరరావు, చాన్ బాషా, ఫణికుమార్, విష్ణు, పోసిన కొండ, నున్న భగవాన్, తదితరులు పాల్గొన్నారు.

బధిరుల, సంజ్ఞా భాషా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఏలూరు: ప్రపంచ బధిరుల దినోత్సవం సంజ్ఞా భాషల అంతర్జాతీయ దినోత్సవజిల్లా స్థాయి వేడుకలు ఏలూరు కలక్టరేట్ వద్ద గిరిజన భవనంలో నిర్వహించారు. వేడుకలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 150మంది బధిర దివ్యాంగులు హాజర య్యారు. దివ్యాంగులలో అర్హత కలిగిన ముగ్గురు బధిర దివ్యాంగులు టచ్ ఫోనులు ఉచితముగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలల పర్యవేక్షణ అధికారిని సూర్య చక్రవేణి, తహసీల్దార్, సి. హెచ్. తాతారావు, స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆంధ్ర ప్రదేశ్ ఉద్యోగుల విభాగము అధ్యక్షురాలు లావణ్య, పశ్చిమ గోదావరి జిల్లా బధిరుల సంఘం అధ్యక్షులు టి.రాము, ప్రధాన కార్యదర్శి, జి.ప్రవీణ్ వర్మ పాల్గొన్నారు.

నడకతో మానసిక రుగ్మతలు దూరం

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం : ప్రతీ రోజు ఉదయం ప్రకృతిలో శారీరక వ్యాయమం చేయడం వల్ల శరీరం,మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటాయని,దీంతో మానసిక రుగ్మతల నుండి శారీరక వ్యాధులను బయట పడవచ్చని రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహరాజు అన్నారు.స్థానిక శేషాద్రినగర్ లో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న మున్సిపల్ పార్క్ వద్ద ఆదివారం ఉదయం వాకర్స్ అసోసియేషన్ , యోగా అసోసియేషన్, ఆరోగ్యాభిలాషులు కలిసి పార్కు అభివృద్ధికి సహకరించిన నడింపల్లి సత్యనారాయణ రాజు (తెలుగు దేశం రాజు)ను ఘనంగా సత్కరించారు.నడింపల్లి సత్యనారాయణ రాజు, స్థానిక క్షత్రియ సేవా సమితి సహకారంతోను, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహ రాజు కృషితో మున్సిపల్ పార్క్ ని అభివృద్ధి చేయడంతో ఈ రోజు ఎంతో మంది ఆరోగ్యాన్ని పొందే విధంగా ఆహ్లాదంగా తయారు చేయడం పట్ల ఆరోగ్యాభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. యోగా గురువు తాండ్ర దిలీప్, అట్లూరి రామరాజు, బోడా సత్యన్నారాయణ, సీనియర్ జర్నలిస్ట్ వాసా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర - రాజోలు : ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరం చుకుని ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన రాజోలు, మామిడికుదురు మండలాలకు చెందిన ఉపాధ్యాయులను రాజోలు రోటరీ క్లబ్ భవనంలో రోటరీ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. రోటరీ అధ్యక్ష,కార్యదర్శులు వై కవీంద్ర, సిహెచ్ లక్ష్మణ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాజోలు మండల విద్యాశాఖ అధికారి నల్లి మనోహరం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న రాజోలు మండలానికి చెందిన ఎఎస్ఆర్ కె.రాజు, మామిడికుదురు మండలానికి చెందిన కెవి రాఘవ రావు, అర్ చెల్లాయమ్మ, అలాగే రాజోలు మండలం నుండి ఉత్తమ ప్రతిభా అవార్డు పొందిన వ్యాయామ ఉపాధ్యాయులు చొప్పల చంద్ర శేఖర్, పెచ్చెట్టి రామకృష్ణలను రోటరీ సభ్యులు శాలువాలు మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్టిక్ గవర్నర్ నల్లి శివ శంకర్, సభ్యులు డాక్టర్ బసవ వరహాలు, దార్ల పెదబాబు, మహ్మద్ కిస్వర్, నామన షణ్ముఖ, ఐ సూర్యనారాయణమూర్తి, సోమ రాజు, బోళ్ళ శ్రీనివాస్, ఎస్టియూ అధ్యక్షుడు రాపాక ప్రసాద్, కార్యదర్శి పివివి సత్యనారాయణ, ఉపాధ్యాయులు కె అంజన్ బాబా, వై రాంబాబు, జి విశ్వనాథ గుప్తా, గటిగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతో నేను అనే నినాదంతో ప్ల కార్డులు ప్రదర్శన

విశాలాంధ్ర - కాకినాడ సిటీ : తెలుగు దేశం పార్టీ జాతీయ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఎక్స్ మేయర్ & కాకినాడ జిల్ల తెలుగు మహిళా అధ్యక్షురాలు సుంకర పావని తిరుమల కుమార్ ఆధ్వర్యంలో నల్ల జెండాలు, బాబుతో నేను అనే నినాదంతో ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తు, కాకినాడ నేలప్పన్ సెంటర్, సుర్యనారాయణ పురం నందు ప్రజలకు చంద్ర బాబుకు జరిగిన అన్యాయాని ప్రతి ఇంటికి కరపత్రాలు రూపంలో పంపిణీ చేస్తు ప్రజలకు వివరించటమైనది. జగన్ రెడ్డి 16 నెలలు జైలులో ఉంటే జగన్ రెడ్డి చేసిన అవినీతి గురించి చేప్పుకున్నారని, చంద్రబాబుని అక్రమ అరెస్టు చైస్తే చంద్రబాబు చేసిన అభివృధిని ప్రజల చైపుకుంటున్నారని, ఎన్ని అక్రమ కేసులు పెట్టిన కడిగిన ముత్యంలా బాబు బయటకు వస్తారని పావని అన్నారు. కార్యక్రమంలో సుంకర పావని వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు తోట సతీష్, నామ రాజకుమార్, చల్ల పార్వతీ, సత్య, నక్క జ్యోతి, రేలంగి లక్ష్మి, కనకం, దుర్గ, సత్యవతి, నిర్మల, రమణ పాల్గొన్నారు.

విడుదల చేసేంతవరకు పోరాటం ఆగదు

బూరుగుపల్లి శేషారావు

విశాలాంధ్ర - నిడదవోలు : తప్పుడు కేసులతో అక్రమంగా అరెస్ట్ చేసిన చంద్రబాబును విడుదల చేసేంతవరకు మా పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. చంద్రబాబు నాయుడుకు తోడుగా, చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టకు నిరశనగా నిడదవోలు మండలం కోరుమామిడిలో నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం,జనసేన పార్టీల ఆధ్వర్యంలో 13 వ రోజు సామూహిక నిరాహార దీక్ష శిబిరం నిర్వహించారు. అనంతరం నిరహార దీక్షలో పాల్గొన్నారు. దీక్ష లో మండల పార్టీ అధ్యక్షులు వెలగన సూర్యారావు,గ్రామ పార్టీ అధ్యక్షులు మటపర్తి చంద్రరావు,టీడీపి, నాయకులు, కార్యకర్తలుపెద్దఎత్తున పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర - యు.కొత్తపల్లి : ఉప్పాడ సముద్ర తీరంలో గణేష్ నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా పోలీస్ బందోబస్తును కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాకినాడ, పెద్దాపురం పోలీస్ డివిజన్లో ఈనెల 18వ తేదీ నుండి ప్రారంభమైన వినాయక చవితి వేడుకలు, ఏడవ రోజు జరుగుతున్న శోభ యాత్రలు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే తీరును స్థానిక పోలీస్ అధికారులతో పర్యటిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఉప్పాడ సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం ప్రదేశాలను పరిశీలించడం జరిగిందని, నిమజ్జనం కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట కాకినాడ రూరల్ సర్కిల్, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి అక్టోబర్ 26 వరకు రోడ్డు, రైల్వే బ్రిడ్జి మూసివేత

రెండు కోట్లతో మరమ్మతు పనులు

విశాలాంధ్ర - కొవ్వూరు : ఈనెల 27 నుంచి రాజమండ్రి కొవ్వూరు మధ్య ఉన్న రైల్వే బ్రిడ్జిని వచ్చేనెల 26 వరకు మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మాధవి లత ఉత్తర్వులు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. బ్రిడ్జికి దాదాపు రెండు కోట్లతో మరమ్మత్తులు చేపడుతున్నట్లు అందువల్ల బ్రిడ్జి మూసివేత అనివార్యమైందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ వంతెన మీద మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను గ్రామన్ ఇండియా బ్రిడ్జి మీదుగా తరలిస్తామన్నారు. అధికారుల అవగాహన లోపం.. ప్రయాణికుల పాలిట శాపం రోడ్ కం రైల్వే బ్రిడ్జిని ఇటీవల కాలంలో తరచూ మూసివేసి మరమ్మతులు సాగించడం పరిపాటయింది. దీంతో ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు. ఎందుకంటే రాజమండ్రిలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉండటం మరోవైపు పెద్ద పెద్ద విద్యాసంస్థలు అక్కడ ఉండడంతో రోగులు, విద్యార్థులు ఈ వంతెన మీదట ప్రయాణాలు సాగిస్తుంటారు. గ్రామ్ ఇండియా బ్రిడ్జి ద్వారా రాజమండ్రి వెళ్ళాలంటే దాదాపు 20 కిలోమీటర్ల పైనే ఉంది. అదే రోడ్డుకం రైల్ బ్రిడ్జి మీదుగా అయితే కేవలం కొవ్వూరు నుంచి రాజమండ్రి ఐదు కిలోమీటర్ల మాత్రమే దూరం ఉంది దీంతో గ్రామన్ ఇండియా వంతెనమీదుగా ప్రయాణించాలంటే దూర భారంతో పాటు ప్రయాణికుల జేబులకు చిల్లులుపడుతున్నాయి. అంతే కాకుండా ప్రమాదకర పరిస్థితిలో ఉన్న రోగులకు మరింత ఇబ్బందిగా మారి ప్రాణాల మీదకి వచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న సందర్భాలు ఉన్నాయి అదే విధంగా పాఠశాల విద్యార్థులు సమయానికి విద్యాసంస్థలకు చేరడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు తరచూ మరమత్తుల పేరుతో మూసివేయడానికి బదులు శాశ్వత పద్ధతిన మరమ్మతులు నిర్వహిస్తే తమకి బాధలు ఉండవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం అత్యవసర వైద్య సేవల నిమిత్తం అంబులెన్సులైనా అనుమతించాలని పలువురుకోరుతున్నారు.

అన్న సమారాధనల నిర్వహణ

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని, వేడుకలు ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామా లలో ఆదివారం అన్న సమారాధనలు నిర్వహించారు. సూర్యారావు పాలెం కమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు వేల మందికి, చివటం గౌడ సేవా సమితి ఆధ్వర్యంలో 2000 మందికి, కె సావరం లలితా నగర్ గణేష్ ఉత్సవ కమిటీ, పరిసర గ్రామ ప్రజలకు 3000 మందికి, ఉండ్రాజవరం వరసిద్ధి వినాయక ఆలయం వద్ద సుమారు 4000 మందికి వివిధ రకాల భోజన పదార్థాలతో అన్న సమారాధనలు నిర్వహించారు.

భారీగా పోలీసుల మోహరింపు

విశాలాంధ్ర - అనపర్తి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు నిరసిస్తూ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బైక్ ర్యాలీకి పిలుపునివ్వడంతో ఆదివారం రామవరంలో ఉద్రిక్తత చోటు చేసుకోవడం జరిగింది.దీంతో రామవరంలో పోలీసులు భారీగా మోహరించారు. రామ కృష్ణారెడ్డి ఇంటి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులు చేరుకుని బందోబస్తు నిర్వహించారు. టిడిపి శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించకుండా పోలీసులు నిలిపివేశారు. సిఐ విప్పర్ల శ్రీనివాస్, ఎస్ ఐ అప్పారావు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా దగ్గరుండి పర్యవేక్షించారు.

న్యాయానికి, ధర్మానికి సంకెళ్లు : కుందుల

విశాలాంధ్ర - నిడదవోలు : రాష్ట్రాన్నీ అభివృద్ధి పథంలో నడిపి 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి గా సేవలందించిన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడమంటే న్యాయానికి సంకెళ్లు, ధర్మానికి సంకెళ్లు వేసినట్లేనని టీడీపీ సీనియర్ నాయకులు కుందుల సత్యనారాయణ అన్నారు. నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టను వ్యతిరేకిస్తూ 12వ రోజులుగా నిర్వహిస్తున్న సామూ హిక నిరాహార దీక్ష నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో ఆదివారం వినూత్న శైలిలో చేతులకు సంకెళ్లు వేసుకుని దీక్ష నిర్వహించారు.

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు జన్మదినం

విశాలాంధ్ర - దేవరపల్లి : గోపాలపురం శాసనసభ్యుడు తలారి వెంకట్రావు జన్మదిన వేడుకలు దేవరపల్లిలో ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివార ఘనంగా జరిగాయి గోపాలపురం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన మండల వైసీపీ అధ్యక్షులు ఎంపీపీలు జడ్పిటిసిలు అధికారులు తదితరులు జన్మదిన వేడుకలు పాల్గొన్నారు. 180 కిలోల కేకును కట్ చేశారు ద్వారకాతిరుమల దేవస్థానం చెందిన వేదపండితులు తలారి వెంకట్రావును వేదమంత్రోచ్ఛారణతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసిచైర్మన్ జి జనార్దన రావు దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడిళ సతీష్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు అంతకుముందు ఎమ్మెల్యే తల్లిదండ్రులు తలారి ఏసుదాసు విజయలక్ష్మి దంపతులు ఎమ్మెల్యే వెంకట్రావును ఆశీర్వదించారు.

దుర్గారావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

విశాలాంధ్ర - అయినవిల్లి : బడుగు దుర్గారావు మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పలు వురు నివాళులర్పించారు. ఇటీవల మరణించిన అయినవిల్లి పెద్ద పేటకు చెందిన కార్మిక, దళిత సంఘాల నాయకుడు బడుగు దుర్గారావు కుటుంబాన్ని జిఎంసి బాలయోగి చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకులు గంగుమళ్ళ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, వైయస్ఆర్ సీపీ నాయకులు ఆదివారం పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. అలాగే దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు బొంతు రాజేంద్రప్రసాద్, మాజీ సైనికులు వడ్డి శ్రీనివాసరావు, నామాడి ఏడు కొండలు, కోరపు శ్రీనివాసరావు, బుడితి శ్రీనివాసు పాల్గొన్నారు.

ఆలయాల్లో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - కాజులూరు : ఆలయాల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖామంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం తనుమళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రామాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఆలయాల ద్వారా వచ్చే తరంగాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయాల వద్ద జరుగుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేసి ఐఖ్యంగా ఉండాలని సూచించారు. అయన నిర్మాణానికి పది లక్షల రూపాయిలు నిధులు మంజూరుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, సలాది రమణ, పిల్లి శ్రీను, దుబాయి శ్రీను, గ్రామస్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ రిలే నిరాహార దీక్ష

విశాలాంధ్ర - పి గన్నవరం : పి గన్నవరంలో టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ టిడిపి నాయకులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగు తున్నాయి. ఈ మేరకు మామిడికుదురు, పి గన్నవరం మండలాల టిడిపి గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఆదివారం రిలే నిరాహార దీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుల రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని పి గన్నవరం నియోజకవర్గ టిడిపి సహా సమన్వయకర్త నామన రాంబాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పి గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.